క్లుప్తంగా

ప్రీ స్కూల్ సిలబస్ బోధించాలి



కేంద్రంలో పరిశీలిస్తున్న సీడీపీఓ కనకదుర్గ

సత్తుపల్లిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు నూరుశాతం హాజరు కావాలని.. సిలబస్ ప్రకారం బోధించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. శనివారం సత్తుపల్లి మండలం బుగ్గపాడు, గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: మండలంలోని పైనంపల్లి తండాలో పంటలను శనివారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నెస్పీ నీటి లభ్యత, మరియు షెడ్యూల్‌పై కమిటీలు, రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ సీహెచ్.శేషగిరి రావు, వ్యవసాయాధికారి నర్సింహారావు, డీఈఈ కిషోర్, ఏఈ రంజిత్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించండి

ఏన్కూరు: ఏళ్లుగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు తెళ్ల నిర్మల్‌కుమార్, దాసరి డేవిడ్ రాజు, తేళ్ల ఎబినేజర్, తేల్లూరి సంజీవ రావు, రవి, దేవదానం, వెంసూర్ పాల్గొన్నారు.

శిలువమార్గ ప్రదర్శన



శిలువమార్గ ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

కొణిజర్ల: మండలంలోని పెద్దమునగాలలో శుక్రవారం సాయంత్రం ఉపవాస ప్రార్థనలు, పరిశుద్ధ శిలువమార్గ ప్రదర్శన నిర్వహించారు. పెద్దగోపతి విచారణ కర్తలు ఫాదర్ కిన్నెర రమేష్ వాక్య పరిచర్య చేయగా అబ్రహం, లింగాల మధు, నాగ సైదులు, తడికమళ్ల సైదులు, నవీన్, బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేఎల్ ఫలితాల్లో ప్రతిభ

వైరా: వైరా మున్సిపాలిటీ జవాన్ గజ్జెల శ్రీను – సుజాత దంపతుల కుమారుడు రంజిత్ జేఎల్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత లెక్చరర్‌గా బాధ్యతలు చేపట్టగా పలువురు అభినందించారు.

☞ **కొణిజర్ల యువకుడు..**

కొణిజర్ల: కొణిజర్లకు చెందిన తాతా రామారావు జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. ముదిగొండ జూనియర్ కళాశాలలో గణిత లెక్చరర్‌గా విధుల్లో చేరిన ఆయనను సమత విద్యాలయం కరస్పాండెంట్ ఉమాశంకర్‌రావు, స్థానికులు రామారావును అభినందించారు.

వాహనం ఢీకొని గాయాలు

వైరారూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బోనకల్ మండలం చిన్నబీరవల్లికి చెందిన ఘట్టం నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. ఆయన చిన్నబీరవల్లి నుండి శనివారం ద్విచక్రవాహనంపై ఏపీలోని నెమలి వైపు వెళ్తుండగా వైరా మండలం గన్నవరం క్రాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గాయపడిన నాగేశ్వరరావును 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

☞ **రోడ్డుప్రమాదంలో ముగ్గురికి..**

పెనుబల్లి: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని రామచంద్రరావు బంజర్‌కు చెందిన మరకాల గణేష్, మరకాల బాబురావు, తడికమల్ల వీరస్వామి మండాలపాడులో వివాహానికి హాజరై గ్రామానికి వస్తున్నారు. వీరి బైక్‌ను వెనుక నుండి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డారు. దీంతో 108లో పెనుబల్లి తరలించారు.

☞ **ఘర్షణలో ఒకరికి...**

మేకల కాపరి, కారులో ప్రయాణిస్తున్న యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీఎం బంజరకు మోటం మారేష్, రాజు కారులో టేకులపల్లి ఎన్నెస్పీ కాల్వ వద్దకు వెళ్లి కాల్వలో స్నానం చేస్తున్నారు. ఇంతలోనే టేకులపల్లికి చెందిన మేకల మంద రావడంతో అవి తాకగా కారు పాడవుతోందని మారేష్ ఆ మేకల కాపరిని మందలించాడు. దీంతో ఘర్షణ మొదలుకాగా మేకల కాపరి అక్కడి రైతులను పిలవడంతో అంతా కలిసి మారేష్‌ను కొట్టారు. దీంతో ఆయన స్పృహ కోల్పోగా మారేష్ వెంట ఉన్న రాజు స్థానికుల సాయంతో పెనుబల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

కూరగాయల సాగు.. భలే బాగు

లాభాలు ఆర్జిస్తున్న రైతులు

సండే స్పెషల్



సోరకాయలను చూపిస్తున్న రైతు

కల్లూరురూరల్: మండలంలోని ముగ్గువెంకటాపురం గ్రామంలో నడికొప్పు నర్సింహారావు అనే రైతు తనకున్న 2.20 ఎకరాల భూమిలో కూరగాయలు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు. వేసవిలో కూరగాయల సాగు కష్టమైనప్పటికీ వ్యవసాయంపై తనకున్న మక్కువతో తన సొంత భూమిలో కూరగాయలు సాగు చేస్తూ సాటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకున్న 2.20 ఎకరాల భూమిలో సబ్సిడీపై డ్రిప్ పరికరాలు తీసుకొని మల్చింగ్ సీట్ వేసి సేంద్రీయ పద్ధతిలో కూరగాయ పంటలు సాగు చేస్తున్నాడు.

ఎకరానికి 50వేల ఆదాయం..

పండించిన కూరగాయలు సమీపంలోని ఆంధ్రా రాష్ట్రంలోగల తిరువూరు మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నాని, కూరగాయలు, ఆకు కూరల ఫలసాయం ద్వారా ఎకరాకు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ఆదాయం వస్తున్నట్లు నర్సింహారావు తెలిపాడు. కల్లూరు మండల వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో కూరగాయలు సాగు జరుగున్నప్పటికీ ప్రత్యేకంగా ముగ్గు వెంకటాపురం, పేరువంచ గ్రామాల్లో ఎక్కువ మంది కూరగాయల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కూరగాయల సాగులో భాగంగా ఎకరాకు దుక్కి, పందిళ్లు, విత్తుకోవడానికి పదివేల నుంచి 15వేల రూపాయల వరకు ఖర్చు చేసి విత్తనాలు వేశారు. పలు చోట్ల దోస పాదులు, సోరకాయ, బుడంకాయ కోసం పందిళ్లు వేశారు. ఎకరాకు విత్తనాల 100 గ్రాముల ప్యాకెట్లు 10 సరిపోతాయి. అంతర్ పంటగా బుడంకాయ, దోసకాయ విత్తనాలు స్థానికంగా కొనుగోలు చేసి విత్తుకుంటున్నారు. బీరా, సోరకాయ, టమాటా పంటలు దిగుబడి వచ్చే వరకు ఆకుకూరలు అందుబాటులో వచ్చే విధంగా నాటుకుంటున్నారు. విడతల వారీగా పంటలు చేతికి వచ్చేలా సాగు విధానం చేపడుతున్నారు. సుమారు రెండు నెలల పాటు పంటలు పండించి మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. అంతర్ పంటలని ఒకే చోట సాగు చేయటం వల్ల ఎరువులు, పురుగు మందులు ఖర్చు తగ్గుతున్నాయి.

సబ్సిడీ కల్పించాలి..

మార్కెట్లో ఉన్న రకాల కూరగాయలు లభ్యం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కూరగాయల సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కల్పించాలని ఈ ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కూరగాయలు, ఆకుకూరలు ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి విక్రయించటం వల్ల ధరలు పెరుగుతున్నాయని, స్థానికంగా కూరగాయల సాగు వల్ల తక్కువ ధరలకే కూరగాయలు, ఆకు కూరలు ప్రజలకు లభ్యమౌతాయని రైతులు పేర్కొన్నారు.

కూరగాయల సాగుపై ఆసక్తి..

వ్యవసాయంతో పాటు ముఖ్యంగా కూరగాయలు సాగు చేయాలని లక్ష్యంతో 20 కుంటల భూమిలో టమాటా, 20 కుంటల భూమిలో సొరకాయలు, బీరకాయలు, మరో 20 కుంటల భూమిలో ఆకు కూరలు, 20 కుంటల భూమిలో బుడం కాయలు, 20 కుంటల భూమిలో దోసకాయలు సాగు చేస్తున్నాడు. కూరగాలయ సాగుతో డ్రిప్ సిస్టం పెట్టినందుకు నీటి సమస్య అంతగా లేదని, కూరగాయల పంటలు కోతులు పాడు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు రైతు తెలిపాడు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి..



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

మధిర: ఉజ్వల భవిష్యత్ కోసం ఆనందకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసేందుకు మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. 2025–26 సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. కళాశాలలో ఉన్న సౌకర్యాలను, అందుబాటులో ఉన్న కోర్సులను వివరిస్తూ విద్యార్థులు అందరూ తప్పనిసరిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, అఫ్రోజ్, ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యంతో అధిక దిగుబడి



రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కృష్ణ, తదితరులు

తల్లాడ: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని అశ్వారావుపేట ఉద్యాన శాస్త్రవేత్త డా.విజయ్‌కృష్ణ అన్నారు. శనివారం తల్లాడ మండలం రామానుజవరంలో రైతులు వెంకటేశ్వరరెడ్డి, ఏసురెడ్డి, శ్రీనివాసరెడ్డి మామిడి తోటలను ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. రసాయనిక పురుగు మందులు వాడకుండా పండు, ఈగ నివారణకు వివిధ మిథైల్ యూజినల్ ఎరలను ఏ విధగా వాడాలో ప్రదర్శించి చూపించారు. కాయ సంచుల ద్వారా కాయ నాణ్యత ప్రమాణాలు పెంచుకోవచ్చని సంచులను అమర్చి చూపించారు. సిఫారసు చేసిన ఎరువులో 1/3 వంతు కాయ ఎదుగుతున్న దశలో అందించాలని, నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలన్నారు. తల్లాడ మండలంలో 2002 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారనీ, ముఖ్యంగా బంగినపల్లి, దశేరి, హిమాయత్, తోతపూరి, రసాలు వంటి రకాలు సాగు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమలో ఉద్యాన అధికారి నగేష్ పాల్గొన్నారు.

సాగునీటికి ఇబ్బందులు రానివ్వొద్దు..



తెలగవరం మైనర్ కాల్వలో నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

తల్లాడ: మండలంలో సాగునీటి సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తల్లాడ తహసీల్దార్ వి.సురేష్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్‌లో ఇరిగేషన్, మండల పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులతో సాగునీటి సరఫరాపై సమీక్ష చేశారు. తల్లాడ మండలంలో ఎన్ని మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్లు ఉన్నాయి, ఎక్కడైనా సాగునీటి కొరత ఉందా అనే విషయాలపై చర్చించారు. రబీ సీజన్లో సాగు చేసిన వరి పైరులో ఒక్క ఎకరం కూడా సాగు నీరందక ఎండిపోయిందనే పేరు రావొద్దన్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ ముగిసిన తర్వాత గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సాగునీటిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని, ఈ విషయమై ఈ నెల 17న మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం ఎన్నెస్పీ తెలగవరం మైనర్ కాల్వలో సాగునీటి సరఫరాను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖా డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏఓ ఎండి.తాజుద్దీన్, జల వనరుల శాఖా ఏఈలు శ్రీనివాసరెడ్డి, నవ్య పాల్గొన్నారు.

నియామకం..

☞ **ఆత్మా కమిటీ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు..**



శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావును మధిర ఆత్మా కమిటీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపాడు.

☞ **డీసీసీబీ బ్యాంక్ ప్యానల్ అడ్వకేట్‌గా 'పెద్దబోయిన'..**



రామనర్సింహారావు

సత్తుపల్లి/కల్లూరు: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్యానల్ అడ్వకేట్‌గా సత్తుపల్లి న్యాయవాది పెద్దబోయిన రామనర్సింహారావును నియమిస్తూ డీసీసీబీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీబీకి సంబంధించిన బ్రాంచ్‌ల ద్వారా మంజూరు చేసి అన్నిరకాల మార్ట్‌గేజ్, రుణాలకు ప్యానల్ అడ్వకేట్ ద్వారా లీగల్ ఒపినియన్ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఉషాశారద, తదితరులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని తహసీల్‌లో శనివారం టీఎన్‌జీవోస్ జిల్లా యూనిట్ పరిధిలో మండల ఉద్యోగ సంఘాల డైరీ, క్యాలెండర్లను తహసీల్దార్ ఉషా శారద ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో టీఎన్‌జీవోస్ సంఘం అన్ని శాఖల ఉద్యోగుల యొక్క అభివృద్ధికి, సంక్షేమానికి ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ ఆర్గనైజింగ్ కార్యదర్శి లింగాల నాగేశ్వరరావు, ఆర్ఐ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శిరీష, జూనియర్ అసిస్టెంట్ పగిడిపల్లి ఏసురత్నం, బాబా, జానీ, వసంత లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వెంగళరావునగర్, ద్వారకాపురి కాలనీ, లలిత కుమారి ఆస్పత్రిరోడ్, జూపల్లి ఆస్పత్రిరోడ్, కల్పతరురోడ్ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **చింతకాని:** విద్యుత్ లైన్ల మరమ్మతుల వలన కొదుమూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి గ్రామాలకు ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

భగవద్గీత పోటీల్లో పతకం



ఉషారాణి

ఏన్కూరు: భగవద్గీత కంఠస్థ పోటీల్లో ఏన్కూరుకు చెందిన మాదినేని ఉషారాణి గోల్డ్‌మెడల్ సాధించారు. 18 అధ్యాయాలు 700 శ్లోకాలు కంఠస్థ చేసి.. మైసూరు దత్త పీఠం నుంచి నిర్వహించిన పోటీల్లో పాల్గొంది. ఈసందర్భంగ ఉషారాణిని స్థానికులు పలువురు అభినందించారు.

స్పోర్ట్స్ మెటీరియల్ ప్రదర్శన

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో స్పోర్ట్స్ మెటీరియల్ ప్రదర్శించారు. ఈ పాఠశాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన పదివేల రూపాయల విలువగల స్పోర్ట్స్ మెటీరియల్‌ని విద్యార్థులు, తల్లిదండ్రుల ముందు ప్రదర్శించి వాటి వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చక్రవర్తి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, కృష్ణబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయం జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 50శాతం రైతులకు ఇప్పిటికీ రుణమాఫీ కాలేదని, రైతు భరోసా మూడు ఎకరాల లోపు రైతులకు ఇవ్వని పరిస్థితి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, నాయకులు పాండు, విఠల్, శ్రీను, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

☞ **పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి..**

కొణిజర్ల: రేపటి భవితకు విద్యే పునాది అని, కావున విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తుమ్మలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాసిరెడ్డి రాజశేఖర్ అన్నారు. శనివారం తుమ్మలపల్లి ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. మైలవరపు పుల్లారావు, నల్లా సాయిబాబా పరీక్ష సామగ్రి అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, ఉపాధ్యాయులు రమేష్, సత్యనారాయణ, రమేష్, భద్రయ్య, హరీష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

☞ **పేరుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో..**



విద్యార్థులకు పరీక్ష కిట్లు అందిస్తున్న జ్యోతిర్మయి

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జ్యోతిర్మయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది విద్యార్థులు పరీక్ష కిట్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్యోతిర్మయి ఫౌండేషన్ ప్రతినిధి జ్యోతిర్మయి, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు వీరునాయక్, దేశ్యా, రాంబాయి, ఫౌండేషన్ సభ్యులు నవీన్, రమ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

☞ **దివ్యాంగులకు బస్‌పాస్‌లు..**

కల్లూరురూరల్: మండలంలోని రఘునాధగూడెంలో శనివారం కల్లూరు న్యూప్రతాప్ ల్యాబ్, ఎక్సరే యజమాని పెడకంటి రామకృష్ణ ఆర్థిక సాయంతో సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందించారు. డిపోకు వచ్చి రాయితీ పాస్‌లు పొందలేని దివ్యాంగులకు ఆర్టీసీ సిబ్బంది గ్రామానికి వచ్చి బస్‌పాస్‌లు అందిస్తారని విలేజ్ బస్‌పాస్ ఆఫీసర్ ఆనందరావు తెలిపారు. దివ్యాంగులకు సాయపడిన దాతకు యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

☞ **వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం..**



రూ.58,116 విరాళం అందజేస్తున్న రంగారావు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో ఇటీవల ప్రతిష్ఠ జరిపిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి పగడాల రంగారావు, జ్యోతి దంపతులు, అమరేశ్వరం మురళీ, పవన్‌కుమార్, వాణి ప్రసన్న, భాను, లక్ష్మణ్‌కుమార్, బిందులు రూ.58,116లు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

☞ **హిందూ శ్మశానవాటికకు పంపు సెట్టు వితరణ..**

కారేపల్లి: కులమతాలకు అతీతంగా.. ఓ ముస్లిం సోదరుడు తన సేవా కార్యక్రమాలను విస్తరింపజేస్తున్నాడు. కారేపల్లికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు, కారేపల్లి జామే మసీద్ మాజీ అధ్యక్షుడు షేక్ గౌసుద్దీన్ రూ.25వేలు విలువ చేసే సబ్‌మెర్సబుల్ పంపు సెట్టును వితరణగా అందజేశాడు. శనివారం కారేపల్లి హిందూ శ్మశాన వాటికలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దల సమక్షంలో బోరు పాయింట్‌లో వేసే సబ్‌మెర్సబుల్ పంపు సెట్టును అందజేశారు. కారేపల్లి గ్రామానికి చెందిన జడల వెంకటేశ్వర్లు శ్మశాన వాటికలో వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు హామీ ఇవ్వటంతో వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో శ్మశాన వాటిక కమిటీ చైర్మన్ తురక నారాయణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'నామా' జన్మదిన వేడుకలు

ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావు జన్మదిన వేడుకలను శనివారం ఆయా మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి.. నామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలుచోట్ల వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

వైభవంగా రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం

తల్లాడ: తల్లాడలోని కృష్ణ మందిరం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో కృష్ణుడు కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి 12 గంటల వరకు కల్యాణతంతు జరిగింది. పుణ్యాహవచనం, యజ్ఞోప వీతం, మాంగల్య దారణ, తలంబ్రాలు, ముత్యాల తలంబ్రాల కార్యక్రమం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్చరణాలతో పాటు, పలువురు దంపతులు పీటలపై కూర్చొన్నారు. సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు.

అంకమ్మ జాతరలో జలబిందెల మహోత్సవం

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో జరుగుతున్న శ్రీఅంకమ్మ జాతర శనివారం రెండో రోజు కొనసాగింది. గ్రామంలో ఇంటింటికీ జలబిందెల మహోత్సవ కార్యక్రమం యాదవులచే నిర్వహించారు. మహిళలు జలబిందెలలో నీరుపోశారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అంకమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మి, పెద్దమ్మతల్లికి పూజలు నిర్వహించారు.

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారికి గ్రామసేవ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చింతకాని: మండల కేంద్రంలో అత్యంత పురాతనమైన శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఆలయంలో స్వామికి గ్రామసేవ, చతుస్థాన అర్చనలు, బలిహారణ, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, నవకలశ స్నపనం, శ్రీ పుష్పయాగం, దేవతా ఉద్వాసన, ధ్వజారోహణం, ద్వాదశ సేవలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు, ఆలయ చైర్మన్లు యండపల్లి శ్రీనివాసరావు, వేదపండితులు ప్రతాపురం పవన్ కుమారాచార్యులు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, గోపీకృష్ణమాచార్యులు. జూనియర్ అసిస్టెంట్ సిద్దెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎద్దుల బండ లాగుడు పోటీలు

వేంసూరు: మండలంలోని కందుకూరులో కొలువుదీరియున్న వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకల సందర్భంగా గొర్ల సత్యనారాయణరెడ్డి(బుల్లిబాబు) జ్ఞాపకార్థం ఈ నెల 13నుంచి నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బండ్ల లాగుడు పోటీలు శనివారం ముగిశాయి. శనివారం నిర్వహించిన సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.80 వేలు, 3వ బహుమతి రూ.60 వేలు, నాల్గో బహుమతి రూ.40వేలు అందించారు. వీటిని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మట్టా దయానంద్ అందించారు. కార్యక్రమంలో వెంకటప్పరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, చెన్నారెడ్డి, సాంబశివ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, చంటి, రాధకృష్ణ, యుగంధర్, భీమయ్య, విజయ్‌కుమార్, ఈశ్వరచారి, నాగరాజు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

చింతకాని: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని టీయూసీఐ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు డిమాండ్ చేశారు. వారి సమస్యల పరిష్కారానికై తహసీల్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు సూర్యప్రకాశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తేనే ఉద్యోగికి గుర్తింపు

బోనకల్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే ఉద్యోగులకు ఎక్కడైనా గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రమాదేవి, ఎస్సై మధుబాబు తెలిపారు. తహసీల్‌లో నాలుగున్నరేళ్ల పాటు ఆర్ఐగా విధులు నిర్వర్తించి నేలకొండపల్లికి బదిలీపై వెళ్లిన గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ సన్మాన సభ శనివారం నిర్వహించగా వారు మాట్లాడారు. అనంతరం లక్ష్మణ్ దంపతులను సన్మానించారు. ఎంఈఓ దామాల పుల్లయ్యతో పాటు కొండ, నాయక్, లింగయ్య, అచ్చయ్య, ఆనందరావు, దుర్గారావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.


వినియోగదారుల హక్కులపై అవగాహన

సత్తుపల్లిటౌన్: సమాజంలో ఆహారకల్తీ, తప్పుడు ప్రకటనలు, మోసపూరితమైన వ్యాపార విధానాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ పి.రామలింగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.గోపి, డాక్టర్ చెన్నారావు, ఎస్‌కె పీర్‌సాహెబ్, మహేష్, బాలకృష్ణ, శోభారాణి, విజయలక్ష్మి, మణిబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు మార్పుపై ఖండన

కల్లూరు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయానికి సూరవరం ప్రతాపరెడ్డి పేరును మార్చు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టడం పట్ల ఆర్యవైశ్య సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ సందర్భంగా కల్లూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్యవైశ్య సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, కార్యదర్శి చారుగుండ్ల వెంకట లక్ష్మీనరసింహారావు పాల్గొని మాట్లాడారు. సూరవరం ప్రతాపరెడ్డిని గౌరవించాలన్నప్పుడు నూతనంగా ఏదైనా ప్రాజెక్టుకు గాని, నూతనంగా ఏర్పాటు చేసే ప్రభుత్వ సంస్థలకు గాని ఆయన పేరు పెట్టినట్లతై సముచితంగా ఉంటుందని, అంతేగాని ఒకరి పేరు మీద ఉన్న విశ్వ విద్యాలయాన్ని పేరు మార్చడం అనేది సరికాదన్నారు.

వైరా రిజర్వాయర్‌కు అందని గోదావరి జలాలు..



సీతారామ ప్రాజెక్ట్ కాల్వను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు అనుసంధానం కోసం సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నుంచి నుంచి విడుదల చేసిన గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు ఒక్క చుక్క కూడా రాలేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం వైరా సాగర్ కాల్వ తిమ్మరావుపేట వద్ద వైరా రిజర్వాయర్‌కు సాగర్ జలాలు మళ్లింపు ఎస్కేప్ చానల్, సీతారామ లింక్ కెనాల్‌లను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరరావు, జానీ, సాయి, కోటేశ్వరరావు, రాములు, లెనిన్, రాజేష్, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.